సాక్షి పెద్దపల్లి

బుధవారం ▪ 18 ▪ సెప్టెంబర్ ▪ 2024


ప్రసంగిస్తున్న మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ శారద

అమరవీరులే స్ఫూర్తి



- ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు
- రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ల శారద
- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

జెండాకు వందనం చేస్తున్న మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ల శారద, కలెక్టర్‌ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్‌, అరుణశ్రీ, డీసీపీ చేతన తదితరులు

సాక్షి, పెద్దపల్లి: ప్రజల ఆకాంక్ష నెరవేర్చడమే లక్ష్యంగా, తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాడు ఉద్యమించిన అమరవీరుల స్ఫూర్తితో ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ల శారద అన్నారు. కలెక్టరేట్‌ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ 1948 సెప్టెంబర్‌ 17వ తేదీకి చరిత్రలో చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. సుమారు 76 సంవత్సరాల క్రితం ఇదేరోజు హైదరాబాద్‌ సంస్థానం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దేశంలో అంతర్భాగంగా మారిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్‌ సమాజం ఉద్యమించిందని ఆమె అన్నారు. ఉద్యమకారుల నుంచి స్ఫూర్తి పొంది ముందుకు సాగాలని కోరారు.

యోధులను స్మరించుకుందాం..

- తెలంగాణ సాయుధ పోరులో అసువులు బాసిన యోధులను స్మరించుకుందామని మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ శారద అన్నారు. ఆదివాసీ యోధుడు కొమురంభీమ్‌తోపాటు దొడ్డి కొమురయ్య, రావినారాయణరెడ్డి, స్వామి రామానంద తీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, వీర వనిత చిట్యాల ఐలమ్మ, ప్రజా ఉద్యమానికి సేనాధిపతిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్‌, దేవులపల్లి వేంకటేశ్వర్‌రావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ప్రజానేతల త్యాగాలను సగర్వంగా స్మరించుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. తమ అక్షరాలతో ప్రజల్లో ఉత్తేజం నింపి, చైతన్యం తెచ్చిన సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, మగ్దూం మొహియుద్దీన్‌, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, షోయబుల్లాఖాన్‌ వంటి సాహితీమూర్తులకు ఘనమైన నివాళి అర్పిద్దామని అన్నారు.

గ్యారంటీల అమలుకు కట్టుబడి..


పోలీసుల గౌరవ వందనం

- ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారంటీ పథకాలను అమలు చేసే దిశగా ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నేరెళ్ల శారద అన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన రెండురోజుల వ్యవధిలోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. రూ.500కే వంటగ్యాస్‌ సిలిండర్‌, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ సరఫరా చేసేందుకు ప్రభుత్వం గృహజ్యోతి పథకం సత్వరమే అమలులోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు.

వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు

- రైతు సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని శారద అన్నారు. ఇందులో భాగంగా రూ.2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం రూపొందించిందన్నారు. దీని ద్వారా వచ్చే ఐదేళ్లలో దాదాపు రూ.లక్ష కోట్ల రుణాలు మహిళలకు అందేలా చర్యలు తీసుకోబోతున్నామని ఆమె వెల్లడించారు.

యువత నైపుణ్యాభివృద్ధికి టాస్క్‌

- సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యూనివర్సల్‌ హెల్త్‌ కేర్‌ పాలసీ రూపొందిస్తోందని శారద తెలిపారు. ఇందుకోసం రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసిందని అన్నారు. జిల్లా యువతకు ఉపాధి లభించేలా వివిధ కోర్సుల్లో అవసరమైన శిక్షణ ఇప్పించేందుకు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఆధునిక టాస్క్‌ సెంటర్‌ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

డ్రగ్స్‌ నిర్మూలనకు కృషి

- యువత డ్రగ్స్‌, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటోందని, దీనిని నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌, కలెక్టర్‌ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌, పెద్దపల్లి డీసీపీ డాక్టర్‌ చేతన, ఆర్డీవో గంగయ్య, కలెక్టరేట్‌ ఏవో శ్రీనివాస్‌, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ల శారదకు మొక్క అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్‌ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్‌ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌, డీసీపీ చేతన


వేదికపై కలెక్టర్‌ కోయ శ్రీహర్ష, రామగుండం నగర మేయర్‌ అనిల్‌కుమార్‌, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్‌, విజయరమణారావు


ప్రజాపాలన దినోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

న్యూస్‌రీల్‌

కమిషనరేట్‌లో వేడుకలు


గౌరవవందనం స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్‌

గోదావరిఖని: రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీపీ శ్రీనివాస్‌ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ(అడ్మిన్‌) రాజు, స్పెషల్‌ బ్రాంచ్‌, ఏఆర్‌ ఏసీపీలు రాఘవేంద్రరావు, సురేంద్ర, ఆర్‌ఐ దామోదర్‌, ఆర్‌ఎస్సై శ్రావణి, వెంకట్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సృష్టికర్త విశ్వకర్మ భగవాన్‌


హోమం చేస్తున్న ఈడీ కేదార్‌ రంజన్‌ పాండు

జ్యోతినగర్‌(రామగుండం): విశ్వ సృష్టికర్త విశ్వకర్మ భగవాన్‌ అని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ కేదార్‌ రంజన్‌ పాండు అన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన వేడుకల్లో హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శాంతిని పొందడానికి, అందరి క్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు బాబర్‌ సలీం పాషా, జనరల్‌ మేనేజర్లు త్రిపాఠి, సాహా తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: నిరంతరంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి ప్రాజెక్టు అండ్‌ ప్లానింగ్‌ డైరెక్టర్‌(పా) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఓసీపీ–3, జీడీకే–5 ఓసీపీని ఆయన సందర్శించారు. బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ఓవర్‌ బర్డన్‌ పనులు పూర్తిచేయాలని అన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించడానికి ప్రతీఉద్యోగి కృషి చేయాలని సూచించారు. ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్‌, సర్వే అధికారి నర్సింగరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్‌ మహ్మద్‌ పాల్గొన్నారు.

సెప్టెంబరు 17 విద్రోహ దినమే


మాట్లాడుతున్న కె.రాజన్న, వేదికపై కృష్ణ, నరేశ్‌

గోదావరిఖని: సెప్టెంబర్‌–17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. స్థానిక యూనియన్‌ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నిరసన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1951 వరకు జరిగిందన్నారు. ఈసందర్భంగా 3 వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలను కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజలకు పంచారని గుర్తుచేశారు. పోరులో 4వేల మంది అమరులయ్యారని అన్నారు. తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం, దేశవిముక్తి కోసం వీరోచితంగా పోరాడారని, బీజేపీ, కాంగ్రెస్‌లు విలీనం, విమోచనమని వక్రీకరిస్తున్నాయన్నారు. ఇ.నరేశ్‌, ఐ.కృష్ణ, శోక్‌, మల్లేశ్‌ ఉన్నారు.

వినియోగంలోకి నిరుపయోగ స్థలాలు

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ ఠాకూర్‌

రామగుండం: బల్దియాలో నిరుపయోగ ప్రభుత్వ భవనాలు కూల్చి, ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకొచ్చి, ఆదాయ వనరుగా మార్చుతామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ అన్నారు. 20వ డివిజన్‌ రైల్వేస్టేషన్‌ ఏరియాలో మంగళవారం ఆయన పర్యటించారు. రైల్వేస్టేషన్‌ ఎదుట నిరుపయోగ ప్రభుత్వ భవనం సమీప ఖాళీ స్థలంలో చేపట్టిన షాపింగ్‌ కాంప్లెక్స్‌ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి చిరు వ్యాపారులకు నామమాత్రపు అద్దెకు ఇస్తామన్నారు. నిరుపయోగమైన వేల ఎకరాలు బీపీఎల్‌ గుప్పిట్లో ఉన్నాయని, వాటితోపాటు ఈఎస్‌ఐ వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణంపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణతోకలిసి ఢిల్లీకి వెళ్లి సమస్య పరిష్కరించాలని కోరుతామన్నారు. కార్పొరేటర్లు కన్నూరి సతీశ్‌కుమార్‌, మహంకాళి స్వామి, కాంగ్రెస్‌ నాయకులు ఇఫ్తాకార్‌, ఇసంపెల్లి అంజులు, సిరిశెట్టి సతీశ్‌గౌడ్‌, బుగ్గ రాములుగౌడ్‌, ఇబ్రహీం, సూర తార, అనుమాస శ్రీనివాస్‌ పాల్గొన్నారు. కాగా, స్థానిక ఓ టీ స్టాల్‌లో కూర్చొని టీ తాగిన మక్కాన్‌సింగ్‌.. తమ కుటుంబంతో సుదీర్ఘకాలం సంబంధాలు కొనసాగించిన వారి యోగక్షేమాలు తదితర విషయాలపై ఆరా తీశారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌

కంపెనీ మనుగడకు కృషి చేయాలి..

పాలకుర్తి(రామగుండం): కేశోరాం సిమెంట్‌ కంపెనీ మనుగడకు కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ కోరారు. కంపెనీలోని వివిధ విభాగాల్లో నిర్వహించిన విశ్వకర్మ పూజల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్లాంట్‌ హెడ్‌ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్‌ మేనేజర్‌ పార్థసారథి, నాయకులు కౌశికహరి, బయ్యపు మనోహర్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్‌, దాడి మహేశ్‌, పర్శవేని శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాగణపతి నిమజ్జనం

పెద్దపల్లిరూరల్‌: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ మైదానంలో ఛత్రపతియువసేన ఏర్పాటు చేసిన 54 అడుగుల మట్టిగణపతి విగ్రహ నిమజ్జనం బుధవారం నిర్వహిస్తామని యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శివంగారి సతీశ్‌ తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భారీ గణేశుడి నిమజ్జనం సందర్భంగా లడ్డూ, బ్రహ్మకలశం బహిరంగ వేలానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అధికారికంగా తెలంగాణ విమోచనం నిర్వహించాలి


అర్జున్‌రావుకు మిఠాయి తినిపిస్తున్న 'గుజ్జుల'

పెద్దపల్లిరూరల్‌: సెప్టెంబర్‌ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన జాతీయ జెండా ఎగురవేసి అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. నాయకులు మీస అర్జున్‌రావు, ఠాకూర్‌ రాంసింగ్‌, ఓదెలు, పల్లె సదానందం, పర్వ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, జంగ చక్రధర్‌రెడ్డి, తూడి రవీందర్‌, క్రాంతికుమార్‌, సంతోష్‌, వరప్రసాద్‌, అల్లెంకి ప్రకాశ్‌, కృష్ణమూర్తి, రాజవీరు, మనోహర్‌, రమేశ్‌, కుమార్‌, జగన్‌ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విమోచన దినోత్సవంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్‌, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, రమేశ్‌, సతీశ్‌, బొడ్డుపల్లి కుమారస్వామి, కుమార్‌, అంజి, రాజేంద్రప్రసాద్‌, పిట్టల వినయ్‌, శ్రీధర్‌, సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్‌ కోయ శ్రీహర్ష
- మాతాశిశు ఆస్పత్రి సందర్శన
- వైద్య సిబ్బందికి పలు సూచనలు

పెద్దపల్లిరూరల్‌: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్‌ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం స్థానిక మాతాశిశు ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అవుట్‌ పేషెంట్‌ విభాగం, మందుల పంపిణీ, చిన్నపిల్లల వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు కూర్చునేందుకు కుర్చీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైతే మరిన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. టీ హబ్‌ ద్వారా చేపట్టే లాబొరేటరీ పరీక్ష ఫలితాల్లో జాప్యం నివారించాలని అన్నారు. ఆర్‌ఎంవో రవీందర్‌ తదితరులు ఉన్నారు.

విధుల్లో 23 మంది వైద్యుల చేరిక

గోదావరిఖని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, సిమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిన నియమించిన 23 మంది వైద్యులు విధుల్లో చేరారని కలెక్టర్‌ కోయ శ్రీహర్ష తెలిపారు. గత ఆగస్టులో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 36మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. అందులో 23 మంది విధుల్లో చేరారని వివరించారు. ఒక అసోసియేట్‌ ప్రొఫెసర్‌, 11మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు, 4 సీనియర్‌ రెసిడెంట్‌, ఏడుగురు ట్యూటర్‌లు విధుల్లో చేరినవారిలో ఉన్నారని తెలిపారు. కాగా, జిల్లా పరిషత్‌ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ కోయ శ్రీహర్ష ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.


సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్‌ కోయ శ్రీహర్ష

పకడ్బందీగా ఎన్‌సీడీ సర్వే

జిల్లాలో ఎన్‌సీడీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్‌ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే, ఆర్‌బీఎస్‌కే ఇమ్యునైజేషన్‌ తదితర అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. బీపీ, షుగర్‌ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఆర్‌బీఎస్‌కేకు సంబంధించిన డీఈఐసీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అప్పుడే జన్మించిన శిశువుల్లో వైకల్యం, గుండెజబ్బుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రాజమౌళి, ప్రసన్నకుమారి, కిరణ్‌, శ్రీరాములు, హరికృష్ణ పాల్గొన్నారు.

వ్యర్థం.. అనర్థం

- ఆర్‌ఎఫ్‌సీఎల్‌ నుంచి రసాయనాలు విడుదల
- శుద్ధి చేయకుండానే నేరుగా గోదావరిలోకి..
- కర్మాగారం అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు
- వ్యాధుల బారినపడుతున్న ప్రభావిత ప్రాంతాల ప్రజలు


రసాయన వ్యర్థాలు కలిసిన నీటిని గోదావరి నదిలోకి విడుదల చేస్తున్న పైపులైన్‌

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పరిశ్రమలు స్థాపిస్తే స్థానిక యువతీయువకులకు ఉద్యోగాలు లభిస్తాయనే ఆశతో తమ భూములు త్యాగం చేశారు. ఇలాంటి పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం ప్రభావిత ప్రాంతాల ప్రజలకు శాపంగా మారుతోంది. ప్రధానంగా రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి చేస్తున్న యూరియా తెలంగాణతోపాటు పొరుగున ఉన్న ఆరు రాష్ట్రాలకూ సరఫరా అవుతోంది. అయితే, ఉత్పత్తి సమయంలో విడుదలయ్యే రసాయన వ్యర్థాలతో ప్రభావిత ప్రాంతాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటున్నాయి. పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థాలను శుద్ధి చేసి వృథా నీటిని బయటికి విడుదల చేయాల్సి ఉంది. కానీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా కాలుష్య కారకాలతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలోని రసాయన నీటిని పైప్‌లైన్‌ ద్వారా గోదావరి నదిలోకి నేరుగా విడుదల చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

- కర్మాగారంలో యూరియా ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే రసాయన వ్యర్థాలను శుద్ధిచేసి నీటిని పైప్‌లైన్‌ ద్వారా తరలించాలి. కానీ, అమ్మోనియా కలిసిన రసాయన వ్యర్థాలను పైప్‌లైన్‌ ద్వారా నేరుగా గోదావరి నదిలోకి వదులుతున్నారు. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు కళ్లలో మంటలు పుట్టి ఊపిరాడకుండా ఇబ్బంది పడాల్సివస్తోంది. దీనిపై బాధితులు, ప్రజాప్రతినిధులు ఇటీవల సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

జీరో లిక్విడ్‌ డిశ్చార్జి ప్రాజెక్టు నిర్మించాలి

- కర్మాగారంలోంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు పరిశ్రమ ఆవరణలో నిబంధనల ప్రకారం జీరో లిక్విడ్‌ డిశ్చార్జి(జెడ్‌ఎల్‌డీ) ప్రాజెక్టు నిర్మించాలి. అయితే, ఎరువుల కర్మాగారంలో జెడ్‌ఎల్‌డీ లేకపోవడంతో రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండానే బయటికి పంపాల్సి వస్తోంది.

అడిషనల్‌ కలెక్టర్‌కు ఫిర్యాదు

- రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలను నేరుగా డ్రైనేజీ నుంచి గోదావరి నదిలోకి వదులుతున్నారు. ఇదేవిషయంపై స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మద్దెల దినేశ్‌ ఇటీవల అదనపు కలెక్టర్‌ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్‌ కోరారు.

ప్రజలకు ఇబ్బందులు



రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వెలువడుతున్న విషపూరిత రసాయనాలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మోనియా లీకైతే భరించరాని ఘాటుతో ముక్కుపుటలు అదిరిపడుతున్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్‌ యాజమాన్యం నిర్లక్ష్యమే ఇందుకు కారణం. జీరో లిక్విడ్‌ డిశ్చార్జి ద్వారా రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి బయటకు విడుదల చేయాలి.

– అంబటి నరేశ్‌, యూనియన్‌ నేత, ఆర్‌ఎఫ్‌సీఎల్‌

శాంపిళ్లు సేకరించాం



రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలను మురికినీటి పైప్‌లైన్‌ ద్వారా గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీటి శాంపిళ్లను ఇటీవల సేకరించాం. పరీక్షల కోసం వరంగల్‌ జోనల్‌ ఆఫీస్‌లోని ల్యాబ్‌కు తరలించాం. రసాయన వ్యర్థాలపై నివేదిక రాగానే కాలుష్య నియంత్రణ మండలి సభ్యులకు సమాచారం తెలియజేస్తాం.

– భిక్షపతి, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి, రామగుండం


రామగుండం ఎరువుల కర్మాగారం


అదనపు కలెక్టర్‌ అరుణశ్రీకి ఫిర్యాదు చేస్తున్న దినేశ్‌

'ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్‌ విగ్రహం ఏర్పాటు'


మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌

గోదావరిఖని: ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌ విమర్శించారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు కోసం తమ క్యాబినెట్‌ తీర్మానం చేసిందని, ఆ స్థలంలోనే రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కించపరచారన్నారు. సమావేశంలో నాయకులు పెంట రాజేశ్‌, పాముకుంట్ల భాస్కర్‌, బాదె అంజలి, గాదెం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, ఎన్వీ రమణారెడ్డి, నడిపెల్లి మురళీధర్‌రావు, పీటీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జమ్మికుంటకు పీసీసీ అధ్యక్షుడు

జమ్మికుంట: జమ్మికుంట పట్టణానికి బుధవారం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రరాజులు రానున్నారు. కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన విషయం తెల్సిందే. ఆయన కుటుంబాన్ని నాయకులు పరామర్శించనున్నారు. ఈ విషయాన్ని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు మంగళవారం రాత్రి తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య


వంశీ మృతదేహం

బుగ్గారం: కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన బత్తిని వంశీ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి ఉరేసుకున్నాడు. వంశీ తండ్రి అంజయ్య గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి బత్తిని లత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

పనిచేస్తూనే పంచాయతీ కార్మికుడి మృతి


భిక్షపతి(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు మీస బిక్షపతి(52) వీధులను శుభ్రం చేస్తూనే మృతిచెందాడు. కుటుంబం సభ్యుల వివరాలు.. బిక్షపతి మంగళవారం వేకువజామునే పనికి వెళ్లాడు. ముస్తాబాద్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వీధిలో చెత్తను తొలగిస్తూ కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించేలోపే తుది శ్వాస వదిలాడు. బిక్షపతి పనిచేస్తూనే తమ కళ్లెదుటే మృతిచెందడంతో పంచాయతీ కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. ముస్తాబాద్ పంచాయతీలో 20 ఏళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్న బిక్షపతికి పదేళ్ల క్రితం గుండె ఆపరేషన్ అయ్యింది. ఇటీవల పంచాయతీలో వేతనాలు పెంచాలని సహ కార్మికులతో ఉద్యమాలు చేశాడని కార్మిక నాయకుడు పోషరాములు తెలిపారు. అధికారులు మెమో ఇవ్వగా తీవ్ర ఆందోళన చెందాడని పోషరాములు పేర్కొన్నారు. బిక్షపతి మృతితో భార్య హన్మవ్వ, కూతుళ్లు రేణుక, భాగ్య రోదనలు మిన్నంటాయి. రేకుల ఇంట్లో నివసించే బిక్షపతికి పెద్ద కూతురు రేణుక అంతిమసంస్కారాలు నిర్వహించింది. అంత్యక్రియలకు పంచాయతీ కార్యదర్శి రమేశ్ రూ.10వేలు అందించి కుటుంబాన్ని ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పంచాయతీ కార్మికులు కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోదావరిఖని: రామగిరి మండలం బేగంపేట నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మంగళవారం తెలిపారు. వ్యానుద్వారా తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక జీడీకే–2ఏ గని సమీపంలో బియ్యంతోపాటు వ్యానును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. బియ్యం తరలింపుతో సంబంధం ఉన్న బేగంపేటకు చెందిన రొడ్డ సతీశ్‌కుమార్, ఈదండ్ల కుమార్, నస్పూరి నరేశ్‌పై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

నిమజ్జనోత్సవంలో నిరసన సెగ

- వేములవాడ రాజన్న గుడి చెరువు వద్ద అధికారుల తీరుపై మండిపడ్డ యువత

వేములవాడ: వేములవాడ రాజన్నగుడి చెరువులో నిమజ్జనం కాస్త నిరసనలకు దారి తీసింది. సోమవారం మధ్యాహ్నం ప్రారంభం కావాల్సిన శోభయాత్రలు ఆలస్యం కావడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు గుడి చెరువు నిమజ్జనం ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసి క్రేన్ల ద్వారా పట్టణంలోని రాజన్న యూత్‌కు సంబంధించిన వినాయక విగ్రహాన్ని చెరువులోకి నిమజ్జనం చేశారు. అయితే అప్పటికే చెరువు నీటిలో వందలాది విగ్రహాలుండటంతో రాజన్న యూత్ విగ్రహం పూర్తి స్థాయిలో నిమజ్జనం కాలేదు. దీంతో మళ్లీ వేరే ప్రాంతంలో నిమజ్జనం చేయాలని యువకులు నిరసన తెలిపారు. తహసీల్దారు మహేశ్, కమిషనర్ సంపత్‌రెడ్డి యువకులను సముదాయించారు. వినాయక విగ్రహాన్ని పూర్తి స్థాయిలో నిమజ్జనం చేయించారు.

చేతులెత్తేసిన పోలీసులు

వేములవాడలో సోమవారం నిర్వహించిన గణేశ్ నిమజ్జనోత్సవంలో పోలీసులు ఎంత ప్రయత్నించినా మంటప నిర్వాహకులు మంగళవారం వేకువజాము వరకు గుడి చెరువు నిమజ్జనం ప్రాంతానికి చేరుకోలేకపోయారు. దీంతో వారు చేతులెత్తేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రాజన్న యూత్ సభ్యులు

మంగళవారం సిరిసిల్లలో జరిగే నిమజ్జనోత్సవానికి తరలివెళ్లారు. దీంతో ఒక్కసారిగా గుడి చెరువు కట్టపైకి వందలాది విగ్రహాలు వచ్చి చేరాయి. ఎస్సై శ్రీధర్ చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

ఉపవాసం కారణమా..?

సోమవారం ఉపవాసం కారణంగా గణేశుడి నిమజ్జనం ఆలస్యమైందని కొంత మంది నిర్వాహకులు బాహాటంగా చెబుతున్నారు. దీంతో రాత్రి 12 గంటల తర్వాత ర్యాలీలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.

జాతీయ ఇన్‌స్పైర్ మనాక్‌లో మనోడు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: కార్మిక ప్రాంతం సిరిసిల్లలో వస్త్ర తయారీ ప్రధాన జీవనాధారం. దీనిలో పనిచేసే కార్మికులకు బట్టలు మడతపెట్టే సులువైన పద్ధతిని ఆవిష్కరించేందుకు సిరిసిల్లలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల చెందిన జక్కని హేమంత్, గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్ సహకారంతో క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌కు అంకురార్పణ చేశారు. ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మనాక్‌లో భాగంగా జాతీయస్థాయి పోటీల్లో పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ప్రదర్శన సత్తా చాటుతుంది. మంగళవారం నుంచి ఈనెల 19 వరకు న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరుగుతున్న జాతీయస్థాయి ప్రదర్శనకు హేమంత్‌తో పాటు గైడ్ టీచర్ శంకర్‌గౌడ్ వెళ్లారు. దేశవ్యాప్తంగా దాదాపు 875 సైన్స్ ఎగ్జిబిట్లు వచ్చాయి. తెలంగాణ నుంచి 24 ఎగ్జిబిట్లు హాజరైనట్లు సమాచారం. ఈసందర్భంగా పోటీల్లో మొదటి 60 మందిలో హేమంత్ నిలవాలని ఎస్సీఆర్టీ అధికారులు రమేశ్‌రావు, సురేందర్, వేణు, శారద తదితరులు ఆకాంక్షించారు.


క్లాత్ ఫోల్డింగ్ మిషన్ గురించి వివరిస్తున్న హేమంత్

గణేశుని విగ్రహాల రాడ్లు చోరీ

- కేసు పెట్టే యోచనలో అధికారులు?


విగ్రహాల నుంచి రాడ్లను తొలగిస్తున్న వ్యక్తులు

మానకొండూర్: మానకొండూర్ చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల నుంచి రాడ్లను కొందరు గ్రామస్తులు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ పట్టణం నుంచి 722 భారీ విగ్రహాలను నాలుగు క్రేన్ల సహాయంతో చెరువులో నిమజ్జనం చేసిన విషయం విదితమే. ఇవే కాకుండా మరో 500కు పైగా చిన్న ప్రతిమలను నిమజ్జనం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఆయా విగ్రహాలకు సంబంధించిన రాడ్లను పోగు చేసి, విక్రయించాలని, అలా వచ్చే డబ్బులతో చెరువులో చెత్తాచెదారం తొలగించాలని భావించారు. కానీ, నిమజ్జనం పూర్తయ్యాక పలువురు గ్రామస్తులు విగ్రహాలకు ఉన్న రాడ్లను తొలగించి, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో తీసుకెళ్లి, అమ్ముకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై అధికారులు కేసు పెట్టే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కోట సచ్చిదానందశాస్త్రీకి ఎములాడతో అనుబంధం

- 70 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో హరికథాగానం
- పద్మశ్రీ అవార్డు గ్రహీత మృతితో కళాకారుల దిగ్భ్రాంతి

వేములవాడ: పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి (92) పేరు వినగానే నవ్వులతో కడుపుబ్బా నవ్వించే హరికథకుడంటూ వేములవాడ వాసులు గొప్పగా చెప్పుకుంటుంటారు. రాజన్న ఆలయంలో 70 ఏళ్లుగా జరుగుతున్న సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాల్లో ఏటా ఆయన హరికథ తప్పకుండా ఉంటుంది. ఆయన హరికథ ఉందంటే చాలు పనులన్నీ పక్కనబెట్టేసి స్నేహితులతో కలసి చాలామంది హరికథ వినేందుకు రాజన్న సన్నిధికి చేరుకునేవారు. ఆయన కథ ఉందంటే విజయవాడలో సినిమా హాల్ కూడా మూసేవారట అప్పట్లో. ఆయన కొన్ని గంటల తరబడి హరికథ చెప్పేవారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్న మొదట భాగవతార్ కోట సచ్చిదానందశాస్త్రి హరికథకు పెట్టని కోట. గణపతి నవరాత్రుల్లో ఎన్నో వేల కథలు చెప్పారు. తొమ్మిది రోజులు పూజలందుకుని వెళ్లిపోతున్న గణపయ్య నిమజ్జనం రోజునే ఈనెల 16న రాత్రి 11.30 గంటలకు పరపదించారని తెలుసుకున్న వేములవాడవాసులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన చెప్పిన కథలను గుర్తు చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులోనూ హుషారుగా హరికథ చెప్పడం మహాగొప్ప అంటూ ఇక్కడి కళాకారులు కితాబునిచ్చేవారు.


2014లో వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగిన సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో హరికథా గానం చేస్తున్న కోట సచ్చిదానందశాస్త్రీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చందుర్తి(వేములవాడ): మండలంలోని ఎన్గల్ గ్రామ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన గడ్డం కిషన్‌రెడ్డి మంగళవారం ద్విచక్ర వాహనంపై ఎన్గల్ గ్రామం వైపు వస్తుండగా, చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన నిదానపు ఎల్లయ్య హన్మాజీపేట వైపు వెళ్తున్నాడు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో కిషన్‌రెడ్డికి కాలు విరగ్గా, ఎల్లయ్య తలకు గాయాలయ్యాయి. ఇద్దరిని 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిచ్చికుక్క దాడిలో..


గాయపడిన జాహ్నవి

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిన్నారి తిక్కల జాహ్నవి ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. ఇదే గ్రామానికి చెందిన పులకం జలేందర్‌ను కరిచింది. ఇద్దరిని కోనరావుపేట ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. కాగా గ్రామంలో కొన్ని రోజులుగా కుక్కల బెడద ఎక్కువ అవుతుందని స్థానిక కార్యదర్శికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

ఇసుక డంపుల స్వాధీనం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయి శివారు గోదావరి వెంట డంప్ చేసిన 75 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గోదావరిలోకి ఇసుక కోసం వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై కందకాలు తవ్వించారు. ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ రోల్లవాగు ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. గోదావరి నుంచి ఇసుక తరలకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ముంతాజొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో రెండురోజులుగా గోదావరి వెంబడి నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చిన్నకొల్వాయి శివారులో 75 ట్రాక్టర్ టిప్పుల ఇసుక కనిపించడంతో స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ ఏడీ, ఆర్‌ఐ డంపులను పరిశీలించారు.


చిన్నకొల్వాయి శివారులో స్వాధీనం చేసుకున్న ఇసుక డంపు

కార్మికుడి మృతిపై కేసు

గోదావరిఖని: సింగరేణి కార్మికుడు బానోతు హరిసింగ్(60) మృతిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మృతి చెందగా అతడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

శోభాయాత్రలో ముగ్గురిపై దాడి

గోదావరిఖని: గణేశ్ శోభాయాత్రలో దాడికి పాల్పడిన ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. స్థానిక అడ్డగుంటపల్లి రామాంజనేయ బార్ వద్ద గాంధీనగర్‌కు చెందిన మణికంఠ, అరుణ్, మున్నా, సిద్ధూ, కేసీఆర్ కాలనీకి చెందిన మహేందర్‌తో కలిసి ఇందిరానగర్‌కు చెందిన విష్ణు, మరో ఇద్దరిపై దాడిచేసి గాయపర్చారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. ప్రజలను భయాందోళనకు గురిచేసేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, నిందితుల్లో ముగ్గురుని అదుపులో తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.


అరెస్ట్ చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

ద్విచక్రవాహనం నుంచి రూ.1.68లక్షలు మాయం

కథలాపూర్(వేములవాడ): బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకున్న ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనం బ్యాగులో పెట్టుకుని ఓ బేకరి ముందు నిలపగా.. కొద్దిసేపటికి అందులో డబ్బులు మాయమైన ఘటన కథలాపూర్ మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని తుర్తి గ్రామానికి చెందిన పుర్రె గంగనర్సయ్య మంగళవారం మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకు నుంచి రూ.1.68 లక్షలు విత్ డ్రా చేసుకున్నాడు. వాటిని ద్విచక్రవాహనంలో పెట్టుకొని బ్యాంకు ముందున్న బేకరి వద్ద నిలిపాడు. ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేసి వచ్చేసరికి డబ్బులు కనిపించలేదు. రెండు బైకులపై వచ్చిన వ్యక్తులు డబ్బులను ఎత్తుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు దేశ ఔన్నత్యాన్ని కించపరిచేలా ఉన్నాయని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి అన్నారు. పార్టీ పిలుపు మేరకు రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మాదిరిగా దేశంలో మతకల్లోలాలు రేకెత్తించేలా కాంగ్రెస్ నాయకుల మాటలున్నాయని తెలిపారు. అలాంటి వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నాయకులు రాగిళ్ల సత్యనారాయణ, నలువాల తిరుపతి, ఆముద రాజు, జుంబర్తి దివాకర్ తదితరులు ఉన్నారు.


రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ మేనిఫెస్టో అమలు చేశారా?

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్‌కార్పొరేషన్: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి 4 నెలలు గడిచిందని, మేనిఫెస్టోలోని హామీలు ఎన్ని అమలు చేశారో చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరుగ్యారంటీల్లో నాలుగు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ రాయితీ, రూ.10 లక్షల రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆర్టీసీ బస్సు ఎక్కితే గ్యారంటీ అమలవుతుందా లేదా తెలుస్తుందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిర్బంధం కొనసాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్నివర్గాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారని వివరించారు. పార్టీని నడిపించడం చేతకాకనే బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ, జగిత్యాలలో మ్యాంగో ప్రాసెస్, పెద్దపల్లిలోని మిర్చీ, పత్తి తదితర పరిశ్రమల్లో సమస్యలు అధిగమించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఫిలిగ్రీ కళకు కరీంనగర్ నిలయమని, గతంలో అంతర్జాతీయ స్థాయికి చేరిందని గుర్తు చేశారు. ఫిలిగ్రీ లాంటి పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఐటీ హబ్‌లను బలోపేతం చేసే దిశగా దృష్టి సారించామని వెల్లడించారు. ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు పెద్ద ఐటీ కంపెనీలను ఆహ్వానించామని, రాష్ట్రంలో ప్రతీ పల్లెకు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. సమావేశంలో మానకొండూరు, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత బాజ్‌పేయ్ తదితరులు

అమరులకు నివాళి

కరీంనగర్: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాళులర్పించారు. కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

త్యాగధనుల పోరాట ఫలితమే స్వేచ్ఛా జీవితం



కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: త్యాగధనుల పోరాట ఫలితమే స్వేచ్ఛా జీవితమని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ చేశారు. మహనీయుల పోరాటంతోనే నిజాం నుంచి తెలంగాణ భారతదేశంలో విలీనమైందని గుర్తు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఆర్డీవో మహేశ్వర్, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు, మడిపల్లి కాళిచరణ్, నేరేళ్ల కిషన్, వివిధ శాఖలు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలి

కరీంనగర్: అనాదిగా అణిచివేతకు గురవుతున్న దళిత, గిరిజనులకు ప్రభుత్వ పంచరాయి భూములను ప్రభుత్వమే పంపిణీ చేసి పట్టాలు అందజేయాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడగొండ సత్యరాజ్‌వర్మ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో సంఘం 20వ వార్షికోత్సవ సందర్భంగా ఉమ్మడి జిల్లా సదస్సు నిర్వహించారు. 75 ఏళ్లుగా ప్రభుత్వ ఫలాలకు నోచుకోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీలు దగా పడుతున్నారని అన్నారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులను సైతం దరి చేరకుండా అగ్రవర్ణాల వారు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందరసింగ్ మాట్లాడుతూ సంఘం బలోపేతంతో పాటు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల సాధనకు సంఘ సభ్యులు ఏకతాటిపైకి వచ్చి పాలక పక్షాలను నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత కమిటీలను రద్దు పరుస్తున్నట్లు, త్వరలోనే రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి జిల్లాస్థాయి కమిటీలను ఎన్నుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దళిత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనుకం వంశీ, నాయకులు కెంసారం తిరుపతి, వెంకటేశ్, రాజ్‌కుమార్, భూమేశ్, స్రవంతి, శేఖర్, శనిగరపు సురేష్, దొమ్మాటి తిరుపతి, ప్రవీణ్, గాజె స్రవంతి, రాజన్న, పటేల్ భూంరెడ్డి, వాసాల శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న సత్యరాజ్‌వర్మ

స్వగ్రామం చేరిన వలస జీవి మృతదేహం


శ్రీకాంత్ (ఫైల్)

కరీంనగర్: ఈనెల 9న ఖతార్‌లో గుండెపోటుతో మృతిచెందిన కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన యువకుడి మృతదేహం మంగళవారం స్వగ్రామం చేరుకుంది. గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్(27) ఉపాధి నిమిత్తం ఖతార్ వెళ్లాడు. ఈనెల 9న వాకింగ్ చేస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని నాచుపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు హైదరాబాద్ ఎయిర్ పోర్టు నుంచి నాచుపల్లి వరకు ప్రభుత్వం ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించింది.



రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: వరుస సెలవుల నేపథ్యంలో వేములవాడ రాజన్న సన్నిధిలో మంగళవారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. ధర్మగుండంలో స్నానాలు చేసి స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

బదిలీపై వచ్చిన ఉద్యోగులకు వీక్లీహాఫ్

రాజన్న ఆలయానికి ఇతర ఆలయాల నుంచి ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులకు వీక్లీహాఫ్ మంజూరు చేస్తూ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. అయితే బదిలీపై వచ్చిన ఉద్యోగులు సెట్ అయ్యే వరకు తిరిగి వారివారి నివాసాలకు వెళ్లి వచ్చేందుకు వీలుగా వీక్లీహాఫ్ అవకాశం కల్పిస్తున్నామని, ఆలయంలో రద్దీ, ఉత్సవాలు, ప్రత్యేక సమయంలో వీక్లీ హాఫ్ కేటాయించబోమని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.